# ఉద్యోగపర్వం

ఆదూరి సావిత్రి

"సుధా ! టిఫిన్ ! క్విక్...." షర్టు గుండీలు పెట్టుకుంటూ గట్టిగా పిలిచాడు రామకృష్ణ.

ఉప్మా ప్లేటులో పెట్టుకుని స్పూన్ వేసి తీసి కొచ్చి టేబుల్ మీద పెడుతూ అతని వంక చూసింది సుధ.

ఒక చేత్తో తలదువ్వుకుంటూనే రెండో చేత్తో గుండీలు పెట్టుకోటానికి ట్రై చేస్తున్నా డతను అతని అవస్థచూసి, వస్తున్న నవ్వాపు కుంటూ స్పూన్‌తో కొద్ది కొద్దిగా ఉప్మాతీసి అతనినోట్లో పెట్టసాగింది సుధ. ఆమెవంక కృతజ్ఞతగాచూసి షైల్స్ సర్దుకుంటూ హడా విడిగా టిఫిన్ చేస్తున్నాడు రామకృష్ణ

"ఏమిటండీ అంత కంగారు? ఎంత డైరెక్టరైతే మాత్రం? టిఫిన్ తినొద్దు.... స్నానం చెయ్యొద్దు అంటాడా రాత్రి మీరింటికొచ్చేసరికి దాదాపు రెండయింది! ఇప్పుడింకా ఏడు కూడాకాలేదు! రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ఏవీ ఉండవా? పై ఆఫీసరన గానే ఇంత జావగారిపోతూ పరుగెట్టాలా?" నిష్ఠూరంగా అన్నది సుధ.

నీకేం తెలుసు సుధా ....వాళ్ళూ....వాళ్ళ బిహేవియరు.... పెద్ద సుపీరియారిటీ ఫీలవుతూ కిందవాళ్ళ నెంత నీచంగా చూస్తారో.... ఒద్దులే! చెపితే నువ్వుబాధపడతావు. నేవస్తాను. తలుపేసుకో. మేం ఫీల్డు మీదికెడుతున్నాం. వచ్చేసరికి ఎంత టైమవుతుందో. నా కోసం చూడక భోంచేసెయ్యి" అంటూ త్వరత్వరగా వెళ్ళిపోయాడు రామకృష్ణ.

* * *

ట్రావెలర్స్ బంగళా బుక్‌చేశారు. ఫామిలీతో సహా దిగాడు డి డి.

"సార్....ఆయన చంద్రికా సోప్ వాడ రంట, ఇస్పిరిగిరా టేశాడు. 'మార్గో' కావాలంట"

అటెండరు లతీఫ్ రహస్యంగా చెప్పాడు రామకృష్ణకు. "ఏది కావాలంటే అదే తెచ్చి తగలెయ్యి. ఎందుకొచ్చిన గొడవ. రాత్రిచ్చిన డబ్బులయిపోయాయా?" "ఇంకెక్కడ సార్! మటన్.... డ్రింక్ .... జీడిపప్పు .... చక్రకేళీలు మీరిచ్చిందికాక రాత్రి సుధాకర్ సారు ఇంకో రెండు వందలిచ్చారు." అన్నాడు లతీఫ్.

"ఇంట్లో కూడా ఇలాగే తింటారా వీళ్ళు? అడిగి మరీ తెప్పించుకుంటారేం అన్నీ? అసహ్యంగా!" అప్పుడే లోపలికొస్తున్న సుధాకర్‌తో అన్నాడు రామకృష్ణ "నువ్వు కాసేపు నోర్మూసుకో గురూ. తర్వాత మాట్లాడుకోవచ్చు కొంపముంచేలా ఉన్నావు నువ్వు!" భయంగా అన్నాడు సుధాకర్.

అందరూ చూపించేంత అతి వినయం చూపకుండా మామూలుగా ఉంటాడని రామ కృష్ణను చూస్తే కాస్తగుర్రుగా ఉంది డి డి.కి.

"వాటీజ్ ది ప్రొగ్రెసాఫ్ యువర్ వర్క్?" జమాయింపుగా అడిగాడు డి డి.

ఆ అడిగే తీరుకు ఒళ్ళుమండినా తమాయించుకుని తన వర్క్ గురించి చెప్పాడు రామకృష్ణ.

"ఐ ఉడ్ లైక్ టు చెకప్ యువర్ ప్లానండ్ లెవెల్"

"యస్సర్ యుకెన్ చెకప్"

తను ఇంగ్లీష్‌లో అడిగితే చేతులు కట్టుకుని వినయంగా తెలుగులో సమాధానమివ్వకుండా తనతో సమానంగా ఇంగ్లీష్‌లోనే ఠీవిగా మాట్లాడుతున్న రామకృష్ణను చూస్తుంటే అరికాలు మంట మాడుకు తంతోంది, డి డి. కి. డైరెక్టుగా "నువ్వు తెలుగులో మాట్లాడి ఏడు అనటానికి సభ్యత అడ్డంవస్తోంది


రామకృష్ణ డి. డి లతీఫ్, సుధాకర్• వర్క్‌స్పాట్‌కి బయలుదేరారు.

రామకృష్ణ వర్క్‌లో ఏదో ఒకలోపాన్ని పట్టుకుని దాని ఆధారంగా అతన్ని చెడామడా దులపాలని వెయ్యికళ్ళతో అబ్జర్వ్ చేస్తున్నాడు డి. డి. రామకృష్ణ మంచివర్కర్. పైగా తెలివీ, సమయస్ఫూర్తీ పుష్కలంగా ఉన్నవాడు ఎక్కడా దొరకలేదు

తమ దగ్గరకు నడిచివస్తున్న రామకృష్ణను తదేకంగా చూస్తున్నాడు డి డి

రామకృష్ణ నడిచేటప్పుడు కాలుకొంచెం పక్కకు అదోరకంగా వేస్తాడు కొంచెం ఒరిగి నడుస్తున్నట్లుంటుంది. అయినా ఎబ్బెట్టుగా ఉండదు.

**వీళ్ళూ శాడిస్టులండీ....వీళ్ళ శాడిజానికి అంతుందా? అసలు వీళ్ళకి క్రింద ఉద్యోగస్థుడైనా....వాడికీ కొంత ఆత్మాభిమానం ఏడుస్తుందని.... వాడూ కాస్తో కూస్తో చదువుకున్నాడనీ కనీస జ్ఞానం కూడా లేకుండా....నౌకరుకన్నా హీనంగా నుంచోబెట్టి మరీ మాట్లాడతారు**



రామకృష్ణ దగ్గరగా వచ్చాక అచ్చం అతను వేసినట్లుగా కాలువేసి చూపిస్తూ "రామకృష్ణా వై ఆర్ యు పుటింగ్ యువర్ లెగ్ లైక్ దిస్.... ఈజిట్ ఫాషన్ ?" ఎగతాళిగా అడిగాడు డి.డి.

అందరూ నవ్వినట్లుగా అనిపించింది రామకృష్ణకు. తన నడకనెవరైనా హేళనచేస్తే పిచ్చి కోపమొస్తుంది రామకృష్ణకు.

మనిషిలో ఏదైనా ఒక బలహీనత ఉన్నప్పుడు.... దాన్నతడొక లోపంగా భావిస్తున్నప్పుడు ఎదుటివాళ్ళు ఆ లోపాన్ని వేలెత్తిచూపి హేళనచేస్తే ఎవరూ సహించరు.

రామకృష్ణ ముఖం ఎర్రబడింది.

"ఇటీజ్ మై హాబిట్" కంఠంలో తీవ్రతను ప్రకటిస్తూ అన్నాడు. ఇంకేదో విసురుగా అనబోతున్న రామకృష్ణను సున్నితంగా సౌంజ్ఞ చేస్తూ ఆపేశాడు సుధాకర్.

రెండోరోజు మళ్ళీ బయలుదేరారు. కావాలని అన్నీ రామకృష్ణ వర్క్‌స్పాట్‌లే చెక్ చెయ్యటం ధ్యేయంగా పెట్టుకున్నాడు డి. డి.

లెవెల్స్ తీస్తున్నారు. ప్లాన్‌లో ఉన్నలెవెల్‌కు వాస్తవానికి కొద్దిగా తేడా వచ్చింది. అదంత పట్టించుకోదగ్గ తేడా కాకపోయినప్పటికీ ఆ పాయింట్ నోట్ చేసుకున్నాడు డైరెక్టరు.

అక్కడ పనిచేస్తున్న లేబరులో కాస్త నాయకత్వ లక్షణాలున్న ఒకతను డి. డి. దగ్గరకొచ్చి తమకీరేటు గిట్టుబాటు కావటం లేదని కాస్త ఎక్కువచెయ్యమని అడిగాడు.

"ఇది మా బాబుగాడి సొత్తుకాదయ్యా రేటు పెంచడానికి. గవర్నమెంటు సొమ్ము. పోయి వాళ్ళతో మొరపెట్టుకోండి" విసుగ్గా అన్నాడు డైరెక్టరు.

"గవర్నమెంట్ చక్రం నడిపేది మీలాంటి ఉద్యోగస్తులద్వారానేగదయ్యా.... ఢిల్లీ పోయి ఇందిరమ్మతో మేం చెపుతామా? ఇంక మధ్యవర్తులు మీరేంచేస్తారు?" అన్నాడతను తన రాజకీయ పరిజ్ఞానాన్ని కనబరుస్తూ.

"ఇలాంటి రెక్‌లెస్ ఫెలోస్‌కి పనిచ్చినందుకు నిన్ను మెచ్చుకోవాలసలు" వెటకారంగా అంటూ "రేపట్నుంచి వీణ్ణిపనిలోకి రానివ్వకు" రామకృష్ణకు ఆర్డర్ జారీచేశాడు డి. డి.

"పోవయ్యోవ్.........పుట్టినకాణ్ణించి ఇదే చేస్తున్నామా మేము? ఈ పనికాకుంటే దీని బాబు ఇంకొకటి.... అనవసరంగా ఆ అయ్య మీదెందుకు పడతావ్" అంటూ నిర్లక్ష్యంగా వెళ్ళిపోయాడు నాయకుడు.

"ఇందాకట్నుంచీ వీడు నన్నేనా నువ్వు, నువ్వు అనేది?" అనుమానంగా అడిగాడు డి.డి.

తన జీప్ హోదా ఇవేవీ తనని బహువచనంలో పంబోధించాలనే జ్ఞానం కలిగించలేదా ఆ అడివి మనషికి.... అనే సందేహంకలుగుతోందాయనకు.

"యస్ సర్.... మిమ్మల్నే...." నవ్వు దాచుకుంటూ చాలాసిన్సియర్గా అన్నాడు రామకృష్ణ రామకృష్ణ కళ్ళలో నవ్వుఛాయలు కనిపెట్టిన డి.డి. భగ్గుమన్నాడు

"సాధారణంగా రాయలసీమలో 'మీరు'అనే పదంవాడటం చాలాఅరుదు సార్ లేబర్ అనలేవాడరు. మీరేకాదు ఆఖరుకు ఢిల్లీనుంచి పై(పైమినిస్టరు దిగివచ్చినా వీళ్ళు నువ్వు అనే అంటారు. అంతమాత్రాన అది తేలికపరచటం, కించపరచటం అనికాదు. వాళ్ళ అలవాటు అంతే" వినయంగా వివరించాడు సుధాకర్.

ఇన్ స్పెక్షన్ పూర్తయింది. దాని తాలూకు రిపోర్టువచ్చింది. దానిలో లెవెల్ లో తప్పుకు ఎక్స్ప్లనేషన్ కోరుతూ ప్రత్యేకంగా రామకృష్ణకో మెమోఇచ్చాడు డి.డి.

"నువ్వు అఫెండవకు. ఇలాంటివి చాలా కాజువల్గా తీసుకోవాలి" అనునయంగా అన్నాడు సుధాకర్.

"అసలిది ఎక్స్ప్లనేషన్కోరేంతతప్పా? కేవలం తనదగ్గర చేతులునలుపుతూ నిలబడలేదని. వ్యక్తిగత ద్వేషంతో ఇలా చెయ్యటం అమానుషం "

"ఈ ఇన్స్పెక్షన్ పేరుతో ఒక్కొక్కడికి వంద రూపాయలంటుకున్నాయి ఇదీకాక నెల నెలా వచ్చి డాక్టరుతో (ఇక్కడ డాక్టరుహస్తవాసి మంచిదని) పరీక్షలు.... ఎక్స రేలు.... ఆ మెడికల్ బిల్లు మన నెత్తిన కొట్టటం. ప్రతి నెలా యాభై రూపాయలు ఇదో ఆముదం, ఆ రోగం తగ్గేదెప్పుడో.... అసలు తగ్గుతుందోలేదో దేముడికి తెలియాలి" అక్కసుగా అ-్నడు రామకృష్ణ

"ఇక్కడ అరటిపళ్ళు బాగున్నాయి వెళ్ళేటప్పుడు ఓ వంద పట్టుకెళ్ళారు సార్.... నన్నే తెమ్మన్నారు" నవ్వాపుకుంటూఅన్నాడు లతీఫ్. అతనికి రామకృష్ణ ఉక్రోషం చూస్తుంటే మా చెడ్డ సరదాగా ఉంది.

'డబ్బులిచ్చాడా ?" అన్నాడు రామకృష్ణ.

"పెద్ద ఆఫీసర్లు డబ్బులివ్వరు. ఆర్డర్లు వేస్తారంతే...." అన్నాడు సుధాకర్.

"మనకన్నా రెట్టింపు జీతాలొస్తాయి ? హోదా, డబ్బు పెరుగుతున్నకొద్దీ వీళ్ళ బుద్ధులింత ఇరుకుగా మారుతాయేం ? సబ్బులు కోళ్ళు. జీప్కి డీసెల్ అన్నీ అదగటమే మనం సిగ్గుపడి చస్తాం !

ఇన్నీ సమకూర్చినా ఇంకా మెమోలు.... అసంతృప్తి.

వీళ్ళూ శాడిస్టులంటే.... వీళ్ళ శాడి జానికి అంతుందా అసలు ?

ఎంత క్రింద ఉద్యోగస్తుడైనా .... వాడికీ కొంత ఆత్మాభిమానం ఏడుస్తుందని.... వాడూ కాస్తో కూస్తో చదువుకున్నాడనీ కనీసజ్ఞానం కూడా లేకుండా .... నౌకరుకన్నా హీనంగా నుంచోబెట్టి మరీ మాట్లాడతారు.

పూర్వం తెల్లవాడు మనదేశాన్ని పాలించేటప్పుడు.... మన తిండి తింటూ, మన నేలమీద ఉంటూ.... మన సంపదననుభవిస్తూ మనల్ని హీనాతి హీనంగా చూశాడని అసహ్యించుకున్నాం, ఇప్పుడు మనవాడు మనల్ని కనీసం సాటి మనిషిగానన్నా చూస్తున్నాడా ? ఏం సాధించామండీ మనం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత...." ఉద్రేకంగా అన్నాడు రామకృష్ణ.

"అందరూ అలా ఉండరు రామకృష్ణా. నీకింకాకొత్త. ఈయనకన్నా ముందున్న డి.డి. విజయభాస్కరరెడ్డి ఎంతమంచివాడో తెలుసా ? అలవాటు చొప్పున మేము ఏం తెప్పించబోయినా మృదువుగా తిరస్కరించేవాడు. ఆయనొస్తే ఒక్కొక్కళ్ళకి పది రూపాయలుకూడా ఖర్చయ్యేదికాదు. 'ముందు కూర్చొని, అప్పుడు మాట్లాడండి." అనేవాడు అప్పుడప్పుడిలాంటివాళ్ళూ తగులుతుంటారు. ఏంచేస్తాం ? సర్దుకోవాలి. కిందవాణ్ణి పైవాడు పైవాణ్ణి ఆపైవాడు.... ఇలా టీజ్ చేసుకుంటూ పోతూనేఉంటారు." అన్నాడు సుధాకర్ నిర్లిప్తంగా.

"నీఅంత ఎడ్జెస్టింగ్ కెపాసిటీ నాకు లేదు" అన్నాడు రామకృష్ణ.

"ఉండాలి. ఈ ఉద్యోగపర్వంలో అది తప్పదు మరి." గీతోపదేశం చేసే కృష్ణ పరమాత్మలా అన్నాడు సుధాకర్. ❋



మంచి జోకు ?

"మంచిజోకు లక్షణం ఏమిటి ?" అడిగాడు జోగారావు జోకేశ్వర్రావుని

"మొదలెట్టగానే నవ్వితే ఉత్తమ జోకు. మధ్యలో నవ్వితే మధ్యమ జోకు పూర్తయ్యాక నవ్వితే అధమ జోకు" అన్నాడు జోకేశ్వర్రావు

"అసలు నవ్వకపోతే ?" అడిగాడు జోగారావు

"అంతబుద్ధిలేనివాడుండడని నా ఉద్దేశం" అన్నాడు జోకేశ్వర్రావు.

–టి. నళిని (హైదాబాద్)

లాటరీటికెటు

–రాగతి పండరి

